మోసాల చంద్రం ... మళ్లొస్తున్నాడహో!



కంకణాలపల్లిలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం



సత్తెనపల్లిలో ఏరియా వైద్యశాల భవనం

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు శనివారం సత్తెనపల్లి వస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో తన పాలనలో చేసిన నిర్లక్ష్యం... ప్రస్తుత పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై కథనం.

- చంద్రబాబు హయాంలో క్షామం, జగన్ హయాంలో సంక్షేమం
- నాడు విద్యా, వైద్యంపై నిర్లక్ష్యం, నేడు ఇంటి ముంగిటకే వైద్యం
- అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం, ప్రతిపక్షంలో కపట ప్రేమ
- ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు సత్తెనపల్లి రానున్న చంద్రబాబు

సత్తెనపల్లి:

నాడు ...

2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో సత్తెనపల్లి నియోజకవర్గ వాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ ప్రాంతం వచ్చినప్పటికీ ఎలాంటి మేలు చేసే ప్రయత్నం చేయలేదు సరికదా అబద్ధపు హామీలతో మోసం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వెన్నాదేవి వద్ద ఏర్పాటు చేసిన 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి 2014 డిసెంబర్ 24న హాజరయ్యాడు. ఆ సమయంలో కంకణాలపల్లి గ్రామాన్ని కూడా సందర్శించాడు. మనుషులకు మాదిరిగానే పశువులకు కూడా ఫ్యాన్‌లు ఏర్పాటుచేసి షెడ్డులు నిర్మిస్తానని ఇచ్చిన హామీ అటకెక్కించారు. కొండమోడు–పేరేచర్ల రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకొని ఎంతో మంది మృత్యువాత పడుతున్నప్పటికీ చంద్రబాబు కనీసం దృష్టి పెట్టలేదు. అచ్చంపేట మార్గంలో రోజుకు 24 సార్లు రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేయడంతో వైద్యం నిమిత్తం వచ్చే వారు అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ పట్టించుకోలేదు.

నేడు ...

సత్తెనపల్లి నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అభివృద్ధిని పరుగులు తీయించారు. గుంటూరు జిల్లా పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు 49.91 కిలోమీటర్లు నాలుగు వరసల రహదారి విస్తరణకు శ్రీకారం చుట్టి 464.28 ఎకరాల భూసేకరణ చేశారు. మూడు బైపాస్‌లు నిర్మించనున్నారు. ఈ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థల పట్టాలు మంజూరు చేశారు. జగనన్న కాలనీలో గృహాల నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. సత్తెనపల్లి మార్కెట్ యార్డులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రూ.97.36 లక్షలతో ఏర్పాటు చేశారు.

- నాడు–నేడు లో భాగంగా రెండు దశల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 1,512 పనులు చేపట్టి రూ.72.65 కోట్లు కేటాయించారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ హంగులు అద్దుకొని ఆకట్టుకుంటున్నాయి.
- టీడీపీ జమానాలో నిర్లక్ష్యానికి గురైన వైద్య రంగానికి జగనన్న ప్రభుత్వం జీవం పోసింది.

ఏరియా వైద్యశాలలో రూ.5.37 కోట్లతో పైఅంతస్తు నిర్మాణం చివరి దశకు చేరింది. రూ.60 లక్షలతో 500 ఎల్పీఎం సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంట్, ఐటీసీ సహకారంతో రూ.35 లక్షల విలువచేసే 300 ఎల్పీఎం సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రూ.55 లక్షలతో 315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, రూ.32 లక్షలతో 250 కేవీ సైలెంట్ జనరేటర్ ఏర్పాటు చేశారు. ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడంతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. రూ.2.85 కోట్లతో 3 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాలను నిర్మించారు.

- పులిచింతల నిర్వాసితుల ఇళ్లప్లాట్లకు రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ రూ.60 కోట్లు మినహాయించి 12 ఆర్ అండ్ ఆర్ సెంటర్లలో నివసిస్తున్న 5,376 కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చారు.
- సత్తెనపల్లిలో 50 సంవత్సరాలకుపైగా జలవనరుల శాఖ స్థలంలో మసీదు ఉండగా రూ.9.60 కోట్ల విలువైన స్థలాన్ని మసీదుకే కేటాయించారు. కనీస ధర రూ.లక్ష కూడా ముస్లింల తరపున మంత్రి అంబటి రాంబాబు చెల్లించారు. రాజుపాలెం మండలం కొండమోడు గ్రామంలో రూ.3 కోట్ల విలువచేసే అరెకరా ప్రభుత్వ స్థలం ముస్లిం కమ్యూనిటీ హాలుకు కేటాయించి నిర్మాణం కొరకు రూ.30 లక్షలు నిధులు సమీకరించారు. సత్తెనపల్లిలోని చెక్‌పోస్ట్ వద్ద 41 గదులు నిర్మించి ముస్లిం, మైనార్టీ వర్గాలకు కేటాయించారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే మరెన్నో అభివృద్ధి పనులతో పాటు సుమారు రూ.1000 కోట్ల సంక్షేమం ఇంటి ముంగిటకు చేర్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

పేద వర్గాలే వైఎస్సార్‌సీపీకి అండ

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీకి పేద, బడుగు, బలహీన వర్గాలే అండగా ఉన్నాయని, రోజు వారి కూలీలు సంతోషంతో మన సమావేశాలకు వస్తారని, మనది మాస్ పార్టీ అని, తెలుగుదేశం పార్టీ సమావేశాలకు అంచు పంచెలు, పట్టు చీరలతో కోటీశ్వరులు వెళ్లే క్లాస్ పార్టీ అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నాలుగు మండలాలు, పట్టణానికి సంబంధించిన ఎస్సీ సెల్ అధ్యక్షుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ చిలక జైపాల్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి అంబటి మాట్లాడుతూ గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు అన్ని వర్గాల వారు సంతోషంతో పార్టీకి అండగా నిలుస్తున్నారన్నారు. ఎస్సీ విభాగాల అధ్యక్షులు రానున్న ఎన్నికల్లో కష్టపడి పనిచేసి ప్రభుత్వం ఇప్పటి వరకు పేద వర్గాలకు అందించిన పారదర్శక సంక్షేమాన్ని వారికి వివరించి, చైతన్యం చేయాలన్నారు. ప్రతి ఓటు విలువైనదేనని రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఇక్కడ నన్ను, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌ను గెలిపించి, జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గుజ్జర్లపూడి కృపావరం, రూరల్ మండలం అధ్యక్షుడు నందిగం యల్లమంద, ముప్పాళ్ళ మండలం అధ్యక్షుడు చావా రమేష్, రాజుపాలెం అధ్యక్షుడు బూదాటి సీతారామయ్య, నకరికల్లు అధ్యక్షుడు వర్ల వెంకటరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రానికి జగనన్నే సీఎం కావాలి



పెదకూరపాడు: రాష్ట్రానికి మళ్లీ జగనన్నే సీఎం కావాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి అన్నారు. శుక్రవారం పెదకూరపాడులోని లగడపాడు రోడ్డులో ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దేవుడు ఇచ్చిన నాయకుడు జగనేనని, ఆయనను మళ్లీ సీఎం చేసుకుంటే ప్రతి పేదవాడి ఇంట్లో వెలుగులు నిండుతాయన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోవు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావును ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి గద్ధం

పెదకూరపాడు: పెదకూరపాడులోని ఎస్సీ కాలనీలోని పాగల్లు రామస్వామికి చెందిన మూడు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమైంది. వివరాల మేరకు పెదకూరపాడుకు చెందిన దివ్యాంగుడు మట్టుపల్లి ప్రకాష్ మృతదేహాన్ని శ్మశానానికి తరలిస్తున్న సమయంలో టపాసులు కాలుస్తున్న నిప్పురవ్వలు పడి రామస్వామి డాబాపై వేసుకున్న మూడు ఎకరాల గడ్డి వామి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మంటలు అదుపు చేసే యత్నం చేసినా అదుపులోకి రాకపోవడంతో, సత్తెనపల్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

క్లుప్తంగా

నేడు మంత్రి అంబటి బైక్‌యాత్ర

నకరికల్లు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బైక్ యాత్ర శనివారం ప్రారంభమవుతుందని మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభమై చల్లగుండ్ల, చీమలమర్రి గ్రామాల మీదుగా కండ్లకుంట గ్రామం వరకు కొనసాగుతుందన్నారు. కండ్లకుంట గ్రామంలో కొద్దిసేపు విరామం అనంతరం తిరిగి నకరికల్లుకు బైక్ యాత్ర వస్తుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అన్ని విభాగాల అధ్యక్షులు తరలిరావాలని కోరారు.

సీఐఎస్ఎఫ్ బలగాలతో పోలీస్ కవాతు



నకరికల్లు: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు అన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాలో సీఐఎస్ఎఫ్ బలగాలతో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో సైరన్ మోగిస్తూ కవాతు చేపట్టారు. ఎస్ఐ పి.రాంబాబు మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటును సద్వినియోగం చేసుకోవడంలో పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగనివ్వమన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్ళలో 94.84% పింఛన్ పంపిణీ

ముప్పాళ్ళ: మండలంలో 94.84% పింఛన్‌ల పంపిణీ పూర్తయిందని తహసీల్దార్ పీ సింగారావు శుక్రవారం తెలిపారు. మొత్తం 6,297 మందికి గాను 5,857 మందికి పింఛన్‌లు అందించామన్నారు. మిగిలిన వారికి కూడా ఇంటికి వెళ్ళి పింఛన్ సాయం అందిస్తామని చెప్పారు. వికలాంగులు, నడవలేని వాళ్ల వద్దకు వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్ అందిస్తారన్నారు.

డప్పు కొట్టి శ్రేణులను ఉత్సాహపరిచిన మంత్రి అంబటి



సత్తెనపల్లి: భారతదేశ మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకొని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అంబటి రాంబాబు పట్టణంలోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో డప్పు కొట్టి వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ శ్రేణులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్త



గుడిపాడు(క్రోసూరు): క్రోసూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జి.సాగర్ గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరాడు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు నచ్చి చాలా మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సాన్‌సీపీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడిపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు కాల్వపల్లి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామంలో టీడీపీలో కీలక పాత్ర వహిస్తున్న పలువురు టీడీపీ నేతలు ఆ పార్టీ వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే శంకరరావు తనయుడు నంబూరు కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముదిగళ్ల పకీరయ్య, ఏసు, మల్లేశ్వరరావు, నరేష్, జ్యోతి, కుమారి, కుటుంబ సభ్యులు ఉన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కళ్యాణ్‌చక్రవర్తి కోరారు. పార్టీలో చేరిన వారికి ఎలాంటి అవసరమొచ్చినా అందుబాటులో ఉంటామన్నారు. పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ పనిచేస్తుందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్లు చేరిన కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల పార్టీ కన్వీనర్ షేక్ షరీఫ్, ఎంపీటీసీ కంచర్ల నిర్మల, సీనియర్ నాయకులు తాళ్లూరి హనుమంతరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పల్లపాటి యోహాను, ఆనందరాజు, తదితరులు పాల్గొన్నారు.

బహుజన బాంధవుడు బాబూ జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు, తదితరులు

క్రోసూరు: దళిత, బహుజనల వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మండల కేంద్రం క్రోసూరులో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య, నాయకులు షేక్ గఫూర్, మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, చిల్కా రవికుమార్, ప్రసన్న, డాక్టర్ షరీఫ్, మేదర రోశయ్య, చావల శ్రీనివాసరావు, చిలకా గోపయ్య, దుగ్గి ఏడుకొండలు, దుగ్గి ఏసయ్య, దయారాజు, పాశం శ్రీనివాసరెడ్డి, కరిముల్లా, ముస్తఫా పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

అమరావతి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే శంకరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు బాబురావు, నందూరు కరుణకుమార్, పలుకూరి రోశిబాబు, అలా లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, రోశయ్య పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో...

భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎస్కే రఫీ, నవీన్, సయ్యద్ మొహిద్దీన్ వలి, ప్రవీణ్‌కుమార్, కోటేశ్వరరావు, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం మండల పరిధిలోని మల్లాది గ్రామంలో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, పార్టీ నాయకులు నంబూరు బాబురావు, పలుకూరి రోశిబాబు, బన్ను పాల్గొన్నారు.

కోటనెమలిపురిలో జగ్జీవన్‌రామ్ జయంతి

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి గ్రామం ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీస్ యూత్ నాయకులు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీస్ మండల అధ్యక్షులు దేపంగి శ్రీనివాసరావు, ఎమ్మార్పీస్ నియోజకవర్గ అధ్యక్షులు చంద్రపాటి నాగేశ్వరరావు, ఎమ్మార్పీస్ నాయకులు మన్నేపల్లి మాణిక్యరావు, అంకాళ్ల మేసయ్య, కంభంపాటి సులేమాన్, బూదాడ మరియదాసు, వర్ల వెంకటేశ్వర్లు, లంజపల్లి ఆనందరావు, చంద్రపాటి ఇస్రాయేలు పాల్గొన్నారు.

మండలంలోని కొండమోడులో గల కేఎస్ఆర్ విద్యా సంస్థల్లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళలో జగ్జీవన్‌రామ్ జయంతి

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముప్పాళ్ళ, గోళ్ళపాడు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు గుజ్జర్లపూడి అశోక్, పరిమి వేణుబాబు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: పెదకూరపాడులోని ఆనందపేటలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు కళ్యాణ్‌చక్రవర్తి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నల్లపాటి యోహాను, ఎస్సీ సెల్ నాయకులు కంచర్ల గోవిందరావు, బీసీ నాయకులు కాలువ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కోటనెమలిపురి ఎస్సీ కాలనీలో..



మల్లాది ఎస్సీ కాలనీలో జగ్జీవన్‌రామ్ జయంతి

బెల్లంకొండలో...



బెల్లంకొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి

బెల్లంకొండ: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల కోసం జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు గర్వించదగ్గవని తెలిపారు.

మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ బద్దూరి చంద్రారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, చావలి పెద వెంకటేశ్వర్లు, అక్కల వెంకట్రామిరెడ్డి, మాటూరి చిట్టిబాబు, బాబూజీ, గడ్డిపర్తి చినబాబు, మౌలాలి, దరియా, బడాడ బచ్చా, ప్రభాకరరావు, సంజీవరెడ్డి, రహమాన్, నిషాద్, బత్తుల వెంకట్రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

అచ్చంపేట: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడుని, ఆయన ఎంతో కష్టపడి అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలలో ఆయన మాట్లాడారు. జగజ్జీవన్‌రామ్ యావత్ భారతావనికి స్ఫూర్తిదాయకమని, అలాంటి మహోన్నత వ్యక్తి గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని చెప్పారు. ముందుగా పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఆయన భారతావనికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, టౌన్‌పార్టీ కన్వీనర్ షేక్ సమరం, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శిఖా తిమోతి, సందెపోగు పున్నారావు, సందెపోగు సంసోను, కొత్తపల్లి దాసుబాబు, నియోజకవర్గ నాయకులు గంగాధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధినాయకుడు రానున్న వేళ..

- బహిర్గతమవుతున్న వర్గపోరు
- టీడీపీ అభ్యర్థి తనసొంత సామాజికకులానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలు
- క్రోసూరు సభకు డుమ్మాకొట్టే యోచనలో కరుడుగట్టిన టీడీపీ నాయకులు

అచ్చంపేట: టీడీపీ అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గానికి వచ్చే వేళ, ఆ పార్టీలో వర్గపోరు స్పష్టంగా బహిర్గతమవుతోంది. అచ్చంపేట మండలంలో ఉన్న 23 గ్రామ పంచాయతీలలో 17 గ్రామ పంచాయతీల టీడీపీ నాయకులు తమ అభ్యర్థి పోకడను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తన సొంత సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని, మొదటి నుంచి పార్టీ జెండాలను మోసిన వారిని పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇదే మండలానికి చెందిన వారైనా, గత కొంత కాలంగా స్థానికంగా ఉండకుండా గుంటూరులో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న కొంతమంది నాయకులు, ఇప్పుడు తగుదునమ్మా అనుకుంటూ మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఇక్కడే ఉంటున్న తమపై పెత్తనం చెలాయించేందుకు వస్తున్నారని, వారికే ఎమ్మెల్యే అభ్యర్థి ప్రాధాన్యత ఇస్తున్నారని కరుడుకట్టిన టీడీపీ నాయకులు సైతం తమ గోడును వినిపిస్తున్నారు. ఇదే కొనసాగితే మూకమ్మడి రాజీనామాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

6న టీడీపీ అధినాయకుడు, అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గానికి రానున్నారు. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు తామంతా గైర్హాజరై తామేంటో నిరూపించుకునేందుకు కొన్ని వర్గాల వారు సంసిద్ధులవుతున్నారు. మరి కొందరు తమ గళాన్ని నిరసన ద్వారా తెలియజేయాలని భావిస్తున్నారు.

దళిత వర్గాలలో నిరసన సెగలు..

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలలో నిరసన సెగలు స్పష్టంగా వినిపిస్తున్నారు. తమకు ప్రాధాన్యతలేని చోట ఉండి ఏం సాధించాలని, తమ పార్టీ వారు కాదని తెలిసినా, ఓటు వేయకపోయిన, అన్ని సంక్షేమ పథకాలు, ఏ ఒక్కరి సిఫార్సు లేకుండా అందజేసిన చోటకే వెళతామంటూ బహిరంగంగానే చెబుతున్నారు. ఇటీవల స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడే స్వయంగా నిర్వహించిన బీసీల ఆత్మీయ సదస్సుకు చాలామంది బీసీలు గైర్హాజరైన విషయం తెలిసిందే. సాక్షాత్తు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సభ జరుగుతుండగానే తనవారిని తీసుకొని నిరసనతో వెళ్లిన విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదే పరిస్థితి మిగిలిన మండలాల్లోను ఉందనే విషయం ఆ పార్టీ వారే వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



కొండూరులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గత 58 నెలలుగా కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా కొనసాగుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులవుతున్న అనేక మంది టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. తాజాగా స్థానిక పడవర ముస్లిం బజార్‌లో టీడీపీకి చెందిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు కళ్యాణ్ చక్రవర్తి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొండూరులో...

మండలంలోని కొండూరులో బీసీ యాదవ కుటుంబానికి చెందిన ఆలా శ్రీనివాసరావు, ఆలా ఆంజనేయులు, గుడారు శ్రీరాములు తదితరులు తమ అనుచరవర్గంతో సహా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి చంద్రబాబు, కాల్వపల్లి సాంబిరెడ్డి, రంగా, చొప్పరపు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా ఆశీర్వదించండి



క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గాన్ని గత ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని మరోసారి మీరంతా అండగా నిలబడి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి ఆయన క్రోసూరులోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. కాలనీలో ప్రతి వారినీ పలకరిస్తూ ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని వివరించారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సీఎం జగన్ పాలనలో సంక్షేమ పథకాలు ఇంటికే వచ్చాయని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, అప్పిరెడ్డి, దాసయ్య, దుగ్గి ఏడుకొండలు, చిల్కా రవి పాల్గొన్నారు.